www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 318 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | ఆదివారం 28-07-2024

MHR TV

www. mhrtv.com

## మోటర్స్ ఆన్...

### నందిమేడారం నుంచి మిడ్ మానేరుకు నీటి తరలింపు

**పెద్దపల్లి జిల్లా , జూలై 27 (ప్రజాస్వరం):** కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెట్టిన డెడ్ లైన్ కు కాంగ్రెస్ ప్రభుత్వం తలొగ్గింది. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నంది మేడారంలో రెండు మోటర్లు ఆన్ చేసిన ఇంజనీర్లు, సాయంత్రానికి మరో 2 మోటర్లు ఆన్ చేసి మిడ్ మానేరు కు నీటి తరలిస్తున్నారు. 4 మోటర్లతో రోజూ 12600 క్యూసెక్కుల నీటిని అంటే 1.2 టీఎంసీలను తరలించనున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది మేడారం పంప్ హౌజ్, లక్ష్మీపూర్ పంప్ హౌజ్ అక్కడి నుంచి కెనాల్ ద్వారా మిడ్ మానేరుకు నీరు వెళ్తుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 17.3 టీఎంసీలు ఉంది.



## విలేకరులు కావలెను

### ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999



## హైదరాబాద్‌లో 'నొరో' వైరస్

- నగరవాసులకు బల్దియా హెచ్చరిక
- అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఓల్డ్ సిటీలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్టు గుర్తింపు
- ఎక్స్ వేదికగా పలు జాగ్రత్తలు సూచించిన జీహెచ్ఎంసీ

| 2

## పథకాల పేరుతో దోచుకున్నారు

- గొర్రెల స్కీంలో కోట్లు దండుకున్నారు
- బతుకమ్మ చీరల్లోనూ అక్రమాలు
- ఓఆర్ఆర్ ను రూ.7వేల కోట్లకే తెగనమ్మారు
- కాళేశ్వరం ఖర్చు విషయంలోనూ మాట మారుస్తున్నారు
- 2017లోనే మోటార్లకు మీటర్లపై కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు
- పాలమూరు - రంగారెడ్డితో ఒరిగిందేమీ లేదు
- రంగారెడ్డి జిల్లాను ఎడారిగా మార్చారు
- ఓల్డ్ సిటీకి మెట్రోను కచ్చితంగా తీసుకొస్తాం
- అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ అబద్ధాలతో సభను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శ

**హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం):** తెలంగాణ బడ్జెట్ చర్చ సందర్భంగా ప్రభుత్వంపై హరీష్ రావు చేసిన కామెంట్స్ పై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడు తున్నారని వాస్తవాలు తెలుసుకొని రికార్డులు సరిచేయాలని స్పీకర్ కు విజ్ఞప్తి చేశారు. 'హరీష్ రావు సభతో పాటు సభ్యులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మోటార్లకు మీటర్ల విషయంలో వాళ్లేదో కేంద్రంతో నిలబడి కొట్లాడి నట్లు మాట్లాడుతున్నారు. ఇది అబద్ధం... వారి తప్పులను కప్పి పుచ్చుకోవడానికి సభలో బుకా యించడం సరికాదు. ఈ విషయంలో రికార్డులను సవరించాల్సిన అవసరం ఉంది. మీటర్ల విషయంలో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పం దాలను సభ ముందు ప్రవేశపెడుతున్నా. మోదీ ప్రభుత్వంతో ఆరు నెలల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్స్ వద్ద మీటర్లు బిగిస్తామని 4 జనవరి 2017న ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంపై అధికారులు అజయ్ మిశ్రా, రఘుమా రెడ్డి, ఏ.గోపాల్ రావు సంతకం పెట్టారు. సభలో నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్న హరీష్ రావు.. వారి హయాంలో జరిగిన ఒప్పందాలను చదువుకుని మాట్లాడాలని సూచించారు. అబద్ధాలతో హరీష్ రావు ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారన్నారు. ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే వారు నమ్మడానికి సిద్ధంగా లేరని చెప్పారు. ప్రజలు శిక్షించినా వాళ్ల ఆలోచన మారలేదు.. అదే ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును రూ.7వేల కోట్లకే తెగనమ్మారు. గొర్రెల స్కీం పేరుతో కోట్ల రూపాయలు దండుకున్నారు. గొప్ప పథకం అని చెప్పిన బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. ఆడబిడ్డల సెంటిమెంట్ నూ దోపిడీకి ఉపయోగించుకున్నారు. కురుమ, యాదవుల సోదరులను అమాయకులను చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. కాళేశ్వరం ఖర్చు విషయంలోనూ గతంలో ఒకటి చెప్పి... ఇప్పుడు రూ.94వేల కోట్లు అని చెబుతున్నారు. అని మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని భూములు అమ్మిందో లెక్కలు తీద్దామా అని సవాల్ చేశారు. మీరు ఎన్ని వేల కోట్ల విలువైన భూములు అమ్మారో లెక్క తీద్దాం. అప్పుల లెక్కలు చెబుతున్నారు.. కానీ అమ్ముకున్న లెక్కలు చెప్పడంలేదు. పదేళ్లయినా పాలమూరుకు చేసిందేమీ లేదు. రూ 20లక్షల కోట్లకు పైగా ఖర్చుపెట్టినా పాలమూరు ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణం వీళ్లు కాదా? అని ప్రశ్నించానే. రంగారెడ్డి జిల్లాను ఎడారిగా మార్చారు. గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నా... జిల్లాపై నిర్లక్ష్యం వహించారు. జిల్లా ఆస్తులు అమ్ముకున్నారు కానీ సాగు నీరు ఇవ్వలేదు. ప్రజలు బీఆరెస్ కు మిగతా 2 లో..




## గందరగోళంగా నీతి ఆయోగ్ మీటింగ్



నీతి ఆయోగ్ సమావేశం నుంచి వాకౌట్ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వాకౌట్
- గైర్హాజరైన ఎన్డీఏ ప్రతిపక్షపాలిత ముఖ్యమంత్రులు
- బీహార్ సీఎం నితీశ్ కుమార్ సైతం డుమ్మా
- బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షపై 'ఇండియా' పార్టీల బహిష్కరణ

| 2



లోయలో పడడంతో నుజ్జునుజ్జైన కారు

## లోయలో పడిన కారు

- ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మృతి
- మృతుల్లో ఐదుగురు చిన్నారులు.. ఒక పోలీస్ అధికారి
- జమ్మూ కశ్మీర్‌లోని దక్సుం ప్రాంతంలో ఘటన

| 2



## త్వరలో.. లిక్కర్ ధరలకు రెక్కలు!

- ఆదాయం పెంచుకోవడంపై సర్కారు నజర్
- హామీలు నెరవేర్చేందుకు నిధుల సమీకరణ
- ఆగస్టు 15 తర్వాత కొత్త ధరలు..!
- రూ.40 వేల కోట్లు వస్తాయని అంచనా
- లోకల్ ఎలక్షన్ల నేపథ్యంలో అమ్మకాలు పెరగొచ్చనే భావన

**నల్గొండ, జూలై 27, (ప్రజాస్వరం):** ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి ఇవి రెండూ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. మరోవైపు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే. అయితే, ఇవ్వాన్ని సక్రమంగా చేపట్టాలంటే నిధులు సమకూర్చడమే అసలైన సవాల్. ఎప్పటి కప్పుడు ఆదాయ మార్గాలను అన్వేషించి పెంచుకుంటూ పోతేనే సర్కారు అనుకున్న లక్ష్యాలను చేరుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగా లిక్కర్ రేట్లను పెంచాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆగస్టు 15 తర్వాత లిక్కర్ రేట్లు రెట్టింపు చేసి ఆదాయాన్ని భారీగా సమకూర్చుకోవాలని రేవంత్ సర్కార్ మిగతా 2 లో..



## ఎర్రబెల్లి సైలెంట్..!

పార్టీ మార్పునకు బ్రేక్ పడినట్టేనా..?

- బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరం
- కాళేశ్వరం టూర్‌కూ డుమ్మా
- ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో హాట్ టాపిక్

| 2

## కేసీఆర్ బాటలోనే రేవంత్

ఇచ్చిన హామీలు అమలుచేయలేక కేంద్రాన్ని బద్నాం చేస్తున్నరు



- అధిక వడ్డీలకు అప్పులు తెస్తే ప్రజలపై మోయలేని భారం పడుతుంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద పార్టీలు
- కాళేశ్వరంపై రెండూ డ్రామాలాడుతున్నాయి
- కేంద్రమంత్రి బండిసంజయ్ ఘాటు విమర్శలు

| 2



# బోర్డర్‌లో హై అలెర్ట్

**మావోల కోసం తెలంగాణ, చత్తీస్ గఢ్ సరిహద్దు జల్లెడ**
**విస్తృతంగా తనిఖీలు, నిఘా ముమ్మరం చేసిన పోలీసులు**
**నేటి నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు**
**భయాందోళనలో ఏజెన్సీ ప్రజలు**

**హైదరాబాద్, జూలై 27, (ప్రజాస్వరం) :** ఒకవైపు ఎన్ కౌంటర్ల పరంపర కొనసాగుతుంటే.. మరోవైపు తెలంగాణ, చత్తీస్ గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో హై అలెర్ట్ కొనసాగుతోంది. మావోయిస్టులను మట్టుబెట్టేందుకు పోలీస్ బలగాలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. జూలై 28 నుంచి మావోయిస్టు పార్టీ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు ముందస్తుగా అప్రమత్తం అయ్యారు. అడవులను జల్లెడ పడుతూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు మావోయిస్టు పార్టీ కూడా అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పిలుపు నిచ్చింది.. జూలై 28 నుండి ఆగస్టు 3వ తేదీ వరకు జరుగనున్న మావోయిస్టు పార్టీ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీలో హై అలర్ట్ కొనసాగుతోంది. ఒకవైపు పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తుంటే, మరో వైపు మావోయిస్టులు లేఖలు విడుదల చేసి కాకరేపుతున్నారు. దీంతో తెలంగాణ – చత్తీస్ గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నివురుగప్పిన నిప్పులా మారింది. ప్రతియేట నిర్వహించే అమర వీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని, పీడిత ప్రజలంతా ఈ ఉత్సవాలలో భాగస్వామ్యం కావాలని మావోయిస్టు పార్టీ పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో ఏజెన్సీ నివురుగప్పిన నిప్పులా మారింది.. పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ, చత్తీస్ గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గోదావరి తీరం వెంట పోలీసుల నిఘా ముమ్మరం చేశారు. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, ములుగు లో ముమ్మరం తనిఖీలు కొనసాగుతున్నాయి. మరోవైపు కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు ఎలాంటి విధ్వంసానికి పాల్పడకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.. గోదావరిలో ఇసుక ర్యాంపుల వద్ద ఉన్న వాహనాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాహనాలను స్థానిక పోలీస్ స్టేషనులకు తరలించారు. ఒకవైపు పోలీసుల తనిఖీలు, హై అలెర్ట్ కొనసాగుతుంటే మరోవైపు మావోయిస్టులు లేఖలు విడుదల చేసి సవాల్ విసిరారు. దీంతో ఉత్సవాల నేపథ్యంలో ఏం జరుగుతుందో అనే టెన్షన్ టెన్షన్ కొనసాగుతోంది.

# త్వరలో.. లిక్కర్ ధరలకు రెక్కలు?

(మొదటి పేజీ తరువాయి)

ఆలోచిస్తోంది.ఈ సంవత్సరం లిక్కర్ అమ్మకాల ద్వారా రూ.40 వేల కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు అధికారులు. గత ఏడాది మద్యం అమ్మకాల ద్వారా రూ.36,493 కోట్ల మేరకు ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో వరుస ఎన్నికలు ఉండటంతో మద్యం అమ్మకాలకు కలిసొచ్చింది. ఎన్నికల్లో మద్యం ఏరులై పారింది. రాజకీయ నాయకులు డబ్బుకు లెక్క చేయక అటు కార్యకర్తలు, ఇటు ఓటర్లకు మద్యం వాళ్ల సొంత డబ్బులు ఖర్చుపెట్టి ఉచితంగా అందించడంతో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. అయితే ఈ ఏడాది కూడా పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలు బాగానే ఉంటాయని అంచనాలు ఉన్నాయి. కల్తీ మద్యం పైనా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే చీప్ లిక్కర్ ను అదుపుచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది. మద్యం ధరలు 20 శాతం పెంచితే బాగుంటుందని భావిస్తోంది ప్రభుత్వం.

# లోయలో పడిన కారు

**❒ ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మృతి**
**❒ జమ్మూ కశ్మీర్‌లోని దక్సుం ప్రాంతంలో ఘటన**

**శ్రీనగర్, జూలై 27:** జమ్ముకశ్మీర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దక్సుం ప్రాంతంలో ఓ వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది ప్రాణాలు కోల్పోయారు. వీళ్లలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టాయి. మృతుల్లో ఓ పోలీస్ కూడా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. అనంత్ నాగ్ జిల్లాలోని దక్సుంలో వాహనం ఒక్కసారిగా అదుపు తప్పిందని, నేరుగా లోయలో పడిపోయిందని తేల్చారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు మృతి చెందినట్టు సమాచారం. ఘటనా స్థలంలోనే అందరూ చనిపోయారు. అంతకు ముందు కూడా దొడ జిల్లాలో ఈ తరహా ప్రమాదమే జరిగింది. ఓ బస్ లోయలో పడిపోయిన ఘటనలో మహిళ ప్రాణాలు కోల్పోయింది. 9 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మృతి చెందాడు.

# సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సూసైడ్

**హైదరాబాద్, జూలై 27 :** మాదాపూర్ లోని దుర్గంచెరువులో ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ కు చెందిన బాలాజీ (25) మాదాపూర్ నాలెడ్జ్ సిటీలోని ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. బుధవారం ఆఫీసుకు వెళ్లిన బాలాజీ అర్ధరాత్రి అయినా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళ నకు గురయ్యారు. ఫోన్ సైతం స్విచ్చాఫ్ చేసి ఉండడంతో స్నేహి తులను విచారించారు. అయినా, ఫలితం లేకపోవడంతో ఈ నెల 25న రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఐటీ కంపెనీలో విచారించగా ఈ నెల 24న రాత్రి 8:30 గంటలకు బాలాజీ బయటకు వెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరాల్లో దుర్గంచెరువు కేబుల్ మీదుగా కిందకి దిగినట్లు కనిపించడంతో గాలించారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం దుర్గం చెరువులో బాలాజీ మృతదేహం లభ్యమైంది. మెడలో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా మృతుడిని గుర్తించారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

# పథకాల పేరుతో దోచుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

గుండుసున్నా ఇచ్చినా బుద్ధి మారకుండా ఇలా మాట్లాడటం సరైంది కాదు. అని రేవంత్ చురకలంటించారు. బీఆర్ ఎస్ నిజాయితీ పాలన అందించి ఉంటే... బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్స్, గొర్రెల పంపిణీ పై విచారణకు సిద్ధంగా ఉన్నారో లేదో చెప్పాలని సవాల్ చేశారు రేవంత్ రెడ్డి.

**అక్బరుద్దీన్ ఒవైసీని డిప్యూటీ సీఎంను చేస్తా**

తెలంగాణ అసెంబ్లీలో శనివారం చర్చ వాడివేడిగా జరిగింది. ఈ క్రమంలో హైదరాబాద్ అభివృద్ధిపై మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓల్డ్ సిటీకి మెట్రో తెస్తామని తాను ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని డిప్యూటీ సీఎంను చేస్తానని హామీ ఇచ్చారు. దాంతో సభలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. 'హైదరాబాద్‌కు మెట్రో రైలును తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. నగరంలో మెట్రో ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో రైలును నిర్లక్ష్యం చేసింది. మేం హైదరాబాద్‌కు తీసుకురాగలిగాం. కానీ గత ప్రభుత్వం ఓల్డ్ సిటీకి మెట్రోను అందుబాటులోకి తేవడంలో పూర్తిగా విఫలమైంది. అసెంబ్లీ వేదికగా మాటిస్తున్నాను. ఈ ప్రభుత్వం గడువు ముగిసేలోగా ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొస్తాం. మెట్రోలోనే వచ్చి ఓల్డ్ సిటీలో ఓట్లు అడుగుతాం. ఒకవేళ అలా జరగని పక్షంలో వచ్చే ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని కాంగ్రెస్ తరఫున కొడంగల్ నుంచి కాంగ్రెస్ బీఫామ్ మీద ఎన్నికల్లో పోటీ చేయించి, అక్బరుద్దీన్ ను గెలిపించుకుంటాం. ఆపై డిప్యూటీ సీఎంగా పదవిలో కూర్చోబెడతాం' అని వ్యాఖ్యానించారు. ఆ పూర్తి బాధ్యతను నేను తీసుకుంటాను. ఇందులో ఏ సందేహం వద్దన్నారు. ఫలక్ నుమా నుంచి చాంద్రాయణ్ గుట్ట వరకు రూ.2675 కోట్లు ఖర్చు పెట్టి మెట్రో రైలు పూర్తి చేస్తాం. భూ సేకరణ ప్రక్రియ సైతం జరుగుతోంది. గౌలిగూడ బస్టాండ్ నుంచి ఫలక్ నుమా, ఫలక్ నుమా నుంచి చాంద్రాయణ గుట్ట వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మెట్రో రైలు తీసుకొచ్చి చూపిస్తామని' సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఎంఐఎం ఎమ్మెల్యే అకర్బరుద్దీన్ కు హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీల్లోనూ భారీగా చర్చ జరుగుతోంది. కొత్తగా 78 కిలోమీటర్ల మేర నిర్మించనున్న హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2 ను జాయింట్ వెంచర్ విధానంలో చేపడుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.



# మహనీయుడు అబ్దుల్ కలాం

**హైదరాబాద్ జూలై 27 (ప్రజాస్వరం):** మాజీ రాష్ట్రపతి ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళుల ర్పించారు. సీఎం నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు స్వర్గీయ కలాంను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఒక శాస్త్రవేత్తగా భారత రక్షణ పరిశోధనా రంగంలో, అంతరిక్ష పరిశోధనా రంగంలో కలాం చేసిన కృషిని దేశం ఎప్పటికీ విస్మరించబోదని సీఎం పేర్కొన్నారు. తన రచనలతోనూ యువతలో దేశ సేవ పట్ల స్ఫూర్తి నింపిన మహనీయుడు కలాం అని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

# హైదరాబాద్ లో నోరో వైరస్

**జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ**

**హైదరాబాద్ జూలై 27 (ప్రజాస్వరం):** కరోనా వైరస్ నుంచి ఈ మధ్యనే తేరుకున్నామో లేదో మరో సరికొత్త వైరస్ హైదరాబాద్ లో వేగంగా వ్యాపిస్తోంది. దానిని 'నోరో వైరస్' అంటున్నారు. ఈ వైరస్ పై జీహెచ్ఎంసీ హెచ్చరికలు చేసింది. ఎక్స్ వేదికగా పలు సూచనలు చేసింది. నోరో వైరస్ లక్షణాలు చలి జ్వరం, వాంతులు, విరేచనాలు, నీరసం, కడుపు నొప్పి, డీహైడ్రెషన్. దీని బారిన పడకుండా ఉండాలంటే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుక్కోవాలని సూచించింది. కాచి చల్లార్చి, వడబోసిన నీరు తాగాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రస్తుతం ఈ వైరస్ యాకుత్ పురా, మలక్ పేట్, డబీర్ పురా, పురానీ హవేలి, మొఘల్ పురా ప్రాంతాల్లో వ్యాపిస్తోంది. చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేరుతున్నట్టు సమాచారం..!

# కేసీఆర్ బాటలోనే రేవంత్

**అధిక వడ్డీలకు అప్పులు తెస్తే ప్రజలపై మోయలేని భారం పడుతుంది**
**కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద పార్టీలు**
**కాళేశ్వరంపై రెండూ డ్రామాలాడుతున్నాయి**
**కేంద్రమంత్రి బండిసంజయ్ ఘాటు విమర్శలు**



కరీంనగర్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం):** కాంగ్రెస్ ప్రభుత్వం బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చి మర్చంట్ బ్యాంకర్స్ ద్వారా అధిక వడ్డీలకు రూ.వేల కోట్లు అప్పులు తెచ్చే కుట్రకు తెరతీసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. కరీంనగర్ లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన సీఎం రేవంత్ రెడ్డిపైనా విమర్శలు చేశారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడం వల్ల రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం పడబోతోందని అన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్, కాంగ్రెస్ 6 గ్యారంటీలు కలిపి గాడిద గుడ్డు.. 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు = గాడిద గుడ్డే అంటూ ఎద్దేవా చేశారు.


ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు చేయలేక కేంద్రాన్ని బద్నాం చేసే కుట్ర పన్నుతున్నారని.. నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి డుమ్మా కొట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ బాటలోనే నడుస్తున్నట్లుగా ఉందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. 'తెలంగాణకు సీఎం తీరుతో పెద్ద నష్టం. భారత్ ను నెంబర్ వన్ గా తీర్చిదిద్దడం, కేంద్ర రాష్ట్ర సంబంధాల బలోపేతమే నీతి ఆయోగ్ సమావేశ ముఖ్య లక్ష్యం. పచ్చి అబద్దాలతో కేంద్రాన్ని బద్నాం చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసిన సీఎంకు ముఖం లేకనే నీతి ఆయోగ్ సమావేశానికి డుమ్మా కొట్టారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాళేశ్వరంలో అక్రమాలు జరిగాయని, పిల్లర్లు దెబ్బతిన్నాయని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది కదా?. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు అవకాశవాదులు.' అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.అవకాశం వస్తే కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ లో విలీనం కావడం ఖాయమని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'అసెంబ్లీలో రెండు పార్టీలు కలిసే బీజేపీకి వ్యతిరేకంగా తీర్మానం చేసింది నిజం కాదా?. లోలోపల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆలింగనం చేసుకుంటున్నారు.. బయటకొచ్చి తిట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ నేతల వార్నింగులను జనం అసలు పట్టించుకోవడమే లేదు. కాళేశ్వరంపై రెండు పార్టీలు కలిసి డ్రామాలాడుతున్నాయని ఆరోపించారు. అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు కొట్లాడుతుంటే.. తట్టుకోలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కైనయ్. మూసీ రివర్ ఫ్రంట్ నిధులడిగిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఎందుకు భారీగా నిధులు కేటాయించలేదో సమాధానం చెప్పలేదు?. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. గత పదేళ్లలో కేంద్రం రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు కేటాయించినట్లు బండి సంజయ్ చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు.

## తుంగభద్ర పరవళ్లు

కృష్ణమ్మతో పాటు తుంగభద్ర కూడా శ్రీశైలం ప్రాజెక్టు వైపు పరవళ్లు తొక్కుతున్నది. కర్ణాటకలోని తుంగభద్ర ప్రాజెక్టు సామర్థ్యం మేరకు నిండిపోవడంతో అక్కడి అన్ని గేట్లను ఎత్తివేశారు. దీంతో సుమారు లక్ష క్యూసెక్కులు నీరు జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా ప్రవహించి జోగులాంబ పుణ్యక్షేత్రం సమీపంలోని గుందిమల్ల వద్ద కృష్ణ నదిలో కలుస్తున్నాయి.

– ప్రజాస్వరం జూలై 27



# ఎర్రబెల్లి సైలెంట్..!

**పార్టీ మార్పుకు బ్రేక్ పడినట్టేనా..?**
**బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరం**
**కాళేశ్వరం టూర్‌కు డుమ్మా**
**నియోజకవర్గానికి సైతం అడపాదడపా రాకపోకలు**
**ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో హాట్ టాపిక్**



**వరంగల్, జూలై 27, (ప్రజాస్వరం) :** ఎర్రబెల్లి దయాకరరావు ఉమ్మడి వరం గల్ జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారు. అయితే, దయాకర్ రావు కొద్దిరోజుల క్రితం పార్టీ మారుతున్న ట్లు పెద్ద ఎత్తిన ప్రచారం జరిగింది. అయితే పార్టీ మార్పు అంశాన్ని పక్కన పెడితే. ఎర్రబెల్లి బీఅర్ఎస్ పార్టీతో అంటి ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల్లో ఉండే దయాకర్ రావు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దయాకర్ రావు ఎమ్మెల్యేగా ఓడిపోవడం, బీఅర్ఎస్ అధికారానికి దూరం కావడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు పార్టీ వీడుతున్నారు. అదే దారిలో నెల రోజుల క్రితమే దయాకర్ రావు కాంగ్రెస్ లోకి వెళ్తున్నట్లు ప్రచారం జరిగింది. అయితే పార్టీ మారడం పై బ్రేక్ పడింది. దీంతో ఎర్రబెల్లి ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు. ఆయన బీఆర్ఎస్ లో ఉండలేక పార్టీ మారలేక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనేక విమర్శలు చేస్తున్న నేపథ్యంలో కేటీఆర్ నేతృత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ముఖ్య నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. కానీ దయాకర్ రావు కాళేశ్వరం టూర్ కు దూరంగా ఉన్నారు. దయాకర్ రావు అందుబాటులో లేకుంటే కాళేశ్వరం సందర్శనకు వెళ్లలేదు అనుకోవచ్చు. కానీ ఆయన హైదరాబాద్ లో ఉండి కూడా పార్టీ చేపట్టిన కార్యక్రమానికి వెళ్లక పోవడంతో పెద్ద చర్చ జరుగుతుంది. దీంతో దయాకర్ రావు పార్టీకి దూరంగా ఉంటున్నారనే అనుమానాలకు బలం చేకూరుతుంది. ఎర్రబెల్లి పార్టీ మారడం ఖాయమని పార్టీ భావిస్తుండడంతో ఆ పార్టీ నేతలు కూడా ఎర్రబెల్లిని పట్టించుకోవడం లేదనే చర్చ జరుగుతుంది.

# గందరగోళంగా నీతి ఆయోగ్

**సమావేశం నుంచి బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వాకౌట్**

**న్యూఢిల్లీ జూలై 27 :** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నీతి ఆయోగ్ సమావేశం మొదలయింది. ప్రసంగించడానికి తగినంత సమయాన్ని కేటాయించకపోవడానికి, సరైన వైఖరి పాటించనందున నిరసనగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు." చంద్రబాబు నాయుడుకి మాట్లాడటానికి 20 నిమిషాలు కేటాయించారు. అస్సాం, గోవా ముఖ్యమంత్రులకు 10 నుంచి 12 నిమిషాలు ఇచ్చారు. కానీ నేను ఐదు నిమిషాలు మాట్లాడక ముందే నన్ను నిలువరించారు. అందుకనే ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాను" అని మమతా బెనర్జీ వివరించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో శనివారం రాష్ట్రపతి భవన్ లో నీతి ఆయోగ్ సమావేశం నిర్వహించారు. అయితే కేంద్రం ఏకపక్ష కేటాయింపులు చేసిందంటూ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సైతం హాజరు కాలేదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు ఎం.కె.స్టాలిన్, కర్నాటక సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సుఖ్వీందర్ సింగ్ సూఖు, కేరళ సీఎం పినరయి విజయన్ వంటి మహామహులు ఈ నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారు.

# నిధులు తేవడంలో కేంద్ర మంత్రులు విఫలం

**మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ**



**హైదరాబాద్ జూలై 27 (ప్రజాస్వరం) :** భాగ్యనగరం అభివృద్ధికి ఇబ్బందులు లేకుండా తెలం గాణ ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. హైదరాబాద్ కు రూ.10 వేల కోట్లు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పొన్నం ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. గతంలో టూరిజం మంత్రిగా పని చేసిన కిషన్ రెడ్డి హైదరా బాద్ కు ఒక్క రూపాయి తీసుకురాలేదని, గతంలో స్మార్ట్ సిటీ వస్తే కరీంన గర్ కు ఇచ్చారని, హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎన్ని నిధులు తీసుకవచ్చారో చెప్పాలని నిలదీశారు. హైదరాబాద్ కు రూపాయి తీసుకురాలేని వాళ్లు కేంద్రమంత్రులుగా ఉండే అర్హత లేదని చురకలంటించారు.హైదరాబాద్ కు నిధులు తీసుకరావడంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు హైదరాబాద్ నగరానికి స్మార్ట్ సిటీ నిధులు తీసుకరావాలని పొన్నం డిమాండ్ చేశారు. విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని స్పష్టం చేశారు. బలహీన వర్గాల రిజర్వేషన్లకు ఇబ్బందులు లేకుండానే పంచాయతీ ఎన్నికలకు వెళ్తామని వివరించారు. విహారయాత్రలకు వెళ్లినట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు బీఆర్ ఎస్ నేతలు వెళ్లారని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన అల్టిమేటంకు ఎవరూ భయపడే ప్రసక్తే లేదన్నారు.రైతులను కాపాడే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని పొన్నం హామీ ఇచ్చారు. గంగా ప్రక్షాళనకు మోదీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసిందని, కానీ మూసీ అభివృద్ధికి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, అందుకే నిరసన తెలియజేయడం కోసమే నీతిఅయోగ్ సమావేశాన్ని బైకాట్ చేస్తున్నామని చెప్పారు. తమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ కట్టకపోవడం వల్ల భారీ నష్టం జరిగిందని పొన్నం వివరించారు.

# ఘనంగా హెచ్ఎండీఏ బోనాలు

**హైద్రాబాద్ జులై 27 (ప్రజాస్వరం):** హెచ్ఎండీఏ ప్రధాన కార్యలయం స్వర్ణజయంతి కాంప్లెక్స్ లో హెచ్ఎండీఏ ఉద్యోగుల సంఘం తెలంగాణ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎండీఏ తెలంగాణ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు, తెలంగాణ ఉద్యోగుల సంఘం కేంద్ర సంఘం ప్రతినిధులు ఉత్సవాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉద్యోగుల సంఘం చైర్మన్ పద్మాచారి మాట్లాడుతూ హైదరాబాద్ కు ప్రత్యేక గుర్తింపు రావడంలో హెచ్ఎండీఏ తెలంగాణ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. దీనిలో తెలంగాణ ఉద్యోగుల ఉద్యోగుల కృషి చాలా ఉన్నతమైనది.ప్రస్తుతం ప్రపంచంలో, భారత దేశంలో హైదరాబాద్ ప్రముఖ స్థానాన్ని సంపాదించింది. మౌలిక వసతుల కల్పన, ఫ్లైఓవర్, మెట్రో రైలు, అండర్ పాస్ వేలు నిర్మాణం, భూసేకరణ చేసి ఆధునీకరించి ప్రజలకు అందుబాటులో తీసుకొని వచ్చింది, రింగ్ రోడ్, ట్రిబుల్ ఆర్, అనుసంధానం చేసుకుంటూ, పీవీఎన్ ఆర్ఎ క్స్ప్రెస్ వే ఏర్పాటు చేసి ప్రజలకు విమానాశ్రయంతో అనుసంధానం చేసింది. భావి తరాలకు అనుగుణంగా ఔటర్ హైదరాబాద్ తీర్చిదిద్దడం లో ముఖ్యపాత్ర పోషిస్తున్నది. అన్ని విభాగాలలో మాదిరిగానే హెచ్ఎండీఏ లో కూడా సరైన రిక్రూట్మెంట్ లేని కారణంగా ఉద్యోగుల కొరత ఏర్పడింది.ప్రభుత్వం వెంటనే రిక్రూట్మెంట్ జరిపి ఉద్యోగ ఖళీలను భర్తీచేయాలి అని అన్నారు.అనుభవం కలిగి రిటైర్ అయిన ఉద్యోగుల సేవలను హెచ్ఎండీఏ ఉపయోగించుకోవాలన్నారు హెచ్ఎండిఏ పరిధిలో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడే అన్ని వెంచర్లలో హెచ్ఎండీఏ ఉద్యోగులకు తెలంగాణ ఇంటిస్థలాలు కేటాయించేలా చేసి రిటైర్మెంట్ లోపు సొంత ఇండ్లు కట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పద్మాచారి కోరారు. బంగారుమైసమ్మ దీవెనలు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ హెచ్ఎండీఏ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యోగుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మఠం రవీంద్ర కుమార్ గారు మాట్లాడుతూ హెచ్ఎండిఏ ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు అని, తెలంగాణ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యగులు వారి కుటుంబసభ్యులు అందరికీ బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మాణం జరుపుకొని బోనాల కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అందరికి ఆరోగ్యం, అశ్వర్యం కలిగించాలని రవీంద్ర కుమార్ ప్రార్థిస్తున్నట్లు తెలియ చేసారు. కార్యక్రమం లో శ్రీ జైకిషన్ భావన్స్ కాలేజీ చైర్మన్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.సచివాలయం ఉద్యోగుల సంఘం చైర్మన్ జీ శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి ఆర్డీవో పీ కృష్ణా రావు ఉపాధ్యక్షులు, సురేందర్ జీ మహేష్ కుమార్ ఐపీఎం వరప్రసాద్, కృష్ణమూర్తి, గోపాల్ రావు, కుమారస్వామి, శ్రీనివాస్, విజయకుమార్, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



# రుణమాఫీ.. రైతన్న హ్యాపీ..



## అన్నదాతల గోసలు తీర్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసింది

### గంగుమళ్ల ఎలక్షన్‌రెడ్డి

**తూప్రాన్, జులై 27 (ప్రజా స్వరం) :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వంగా పిలువబడుతున్నది. అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకొని వారికి దోహద పడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ బ్రహ్మాండంగా ఉందని గంగుమళ్ల ఎలక్షన్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వరం ప్రతినిధితో సోమవారం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల వారిని కలుపుకొని వారి అభివృద్ధికి దోహద పడే విధంగా ప్రవేశ పెట్టినట్టుగా ఈ బడ్జెట్ వుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విదంగా సబ్బండ వర్గాల వారికి అధిక ప్రాధాన్యత నిస్తూ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ వల్ల ప్రజలు మరింత ఆర్థికంగా బలపడే అవకాశం వుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ వంటి బడుగు బలహీన వర్గాల వారికిపెద్ద పీట వేస్తున్నట్లుగా బడ్జెట్ ఉన్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం ప్రవేశ పెట్టే ప్రతి సంక్షేమ ప్రథకం అణగారిని వర్గాల వారిని ఆకట్టుకుంటుందని అయన అన్నారు. 2 లక్షల రూపాయల రుణమాఫీ పథకం అమలు చేసిన ప్రభుత్వంగా దేశంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ సర్కార్ ముందుందని అయన పేర్కొన్నారు. దశల వారీగా 2 లక్షల రూపాయలు రుణాలున్న రైతులందరికీ రుణాలు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. రైతుల కుటుంబాల్లో ఆనందం నింపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులు ఎంతో రుణ పడున్నారని తెలిపారు.

**కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం విచారకరం**

**తెలంగాణ ప్రజలు మోడీని నమ్మారు కానీ..**

తెలంగాణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసింది. నిధులు మంజూరు చేసి రాష్ట్ర అభివృద్ధికి సహాయ పడాల్సిన నరేంద్ర మోడీ నిధులు మంజూరు చేయక పోవడం బాధాకరం. రాష్ట్రంలో బీజేపీని 8 ఎంపీ స్థానాల్లో గెలిపించారు. అయినా మొండి చేయి చూపారు. 3 ఎంపీ స్థానాలున్న ఏపీకి భారీగా నిధులిచ్చిన కేంద్రం తెలంగాణకు ఎందుకీ ఇవ్వలేదో వారే సమాధానం చెప్పాలి. తెలంగాణ ఆదాయంలో పాలు పంచుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం రాష్ట్రంపై వివక్షాగానే భావించాల్సి వస్తుంది.

## 'ధరణి' పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్, జులై 27 (ప్రజా స్వరం) :**

ధరణి పెండింగ్ కేసులను వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా తహాశీల్దార్ కార్యాలయం, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల, పశు వైద్యశాలను తనిఖీ చేశారు. తహసిల్దార్ కార్యాలయంలోని ధరణి పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో భోజన ఏర్పాట్లను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో టీచర్ గా మారి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించారు. విద్యార్థులను గణితంలో వివిధ ప్రశ్నలడుగుతూ సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఉన్నారని, చాలా బాగా చదువుతున్నారని , విద్యార్థుల్ని ఉపాధ్యాయుని అభినందించారు. మండల కేంద్రంలోని వాడలన్నీ తిరుగుతూ జీరో విద్యుత్ బిల్లు ,గ్యాస్ సబ్సిడీ పొందుతున్న లబ్ధి దారులను పలకరించారు. జీరో కరెంట్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ పొందుతున్న లబ్ధిదారులతో వివరాలను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు మాట్లాడుతూ మాసాయిపేట మండలంలో ధరణిలో పెండింగ్ కేసుల పూర్తి చేయాలన్నారు. భూ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వారికి ,వారి సమస్యలపై లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలని అధికారులను సూచించారు. అంగన్వాడీలలో పౌష్టికాహారమైన భోజనం అందించాలనీ, అంగన్వాడి లో ఉన్న వంట గదిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత కలిగిన విద్య,





భోజనం తో పాటు అర్హత కలిగిన, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, ఉత్తమమైన బోధన ఈ పాఠశాలలో జరుగుతుందని విద్యార్థులను అభినందించారు. తానే స్వయంగా విద్యార్థులకు గణితం పాఠాలు బోధిస్తూ గణితంలో ఉన్న మెలకువలను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరిస్తానని తెలియజేశారు. గ్రామంలో ఉన్న వాడలన్నీ పరిశీలిస్తూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిలవకుండా చూడాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారులతో మాట్లాడుతూ అర్హత కలిగిన అందరికీ జీరో బిల్లు , సబ్సిడీ గ్యాస్ అందాలన్నారు. పశు వైద్యశాలలో అధికారులు సమయపాలన పాటించి, అన్ని రకాల మందులను అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు.

## ఓబీసీ మోర్చ జిల్లా కోశాధికారిగా బక్కవారి శివ




**మెదక్, జులై 27 (ప్రజా స్వరం) :**

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్ ఓబీసీ మోర్చ జిల్లా కోశాధికారిగా బక్కవారి శివ నియామితులయ్యారు. శనివారం మెదక్ జిల్లా బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ ఎంఎల్ ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు సతీష్, మండల అధ్యక్షులు ప్రభాకర్, రాజు, నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**గజ్వేల్, జూలై 27 (ప్రజా స్వరం) :**

గజ్వేల్ మండల బీజేపీ కార్యవర్గ సమావేశం గజ్వేల్‌లో మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిలుగా రాష్ట్ర నాయకులు రాంరెడ్డి, మండల ఇన్‌చార్జి నందన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు జశ్వంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం ఏ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో గజ్వేల్ మండలం జడ్పీటీసీ అదేవిధంగా మండలంలోని అత్యధిక ఎంపీటీసీలను కైవసం చేసుకోవాలని గజ్వేల్ గడ్డమీద కాషాయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ బండారి మహేష్, ఎల్కంటి సురేష్, సీనియర్ నాయకులు వంజరి రాజు, కిరణ్ కుమార్ రెడ్డి, రామచంద్రరావు, దళిత మోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి మణి శేఖర్, మహిళా మోర్చ ప్రధానకార్యదర్శి భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు మేక ఉమా, ఆనంద్ సాయి, వెంకటేష్‌గౌడ్, అరవింద్, కూమార్‌గౌడ్, భీంకూమర్, రాజు, స్వామి, మహేశ్‌చారి, సాయికిరణ్, మామత, సరిత, భిక్షపతి, భాస్కర్‌రెడ్డి, అశోక్ యాదవ్, శ్రీరాం నగేష్, నవీన్, శ్యాం, ప్రసాద్, ముఖర్జీ, కనకరాజు, బాసురాజు, శాన్వీష్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీకాంత్, భారత్ తదితరులు పాల్గొన్నారు.









## సబ్కా సాథ్, సబ్కా వికాస్

# ప్రధాని మోడీ లక్ష్యం

### కేంద్ర బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు సమాన కేటాయింపులు

### తెలంగాణ అభివృద్ధికి మోడీ సర్కార్ కట్టుబడి ఉంది

### ఎన్ని కుట్రలు చేసిన ప్రజలకు మోడీపై నమ్మకం ఉంది

### కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

**మెదక్, జులై 27 (ప్రజా స్వరం) :**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అన్ని రాష్ట్రాలకు సమాన కేటాయింపులు చేశామని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రం బీజేపీ జిల్లా కార్యాలయంలో కేంద్ర ప్రవేశ పెట్టిన బడ్జెట్ పైన ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అన్ని రాష్ట్రాలకు సమాన కేటాయింపులు చేశామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కొత్త రాజధాని ఏర్పాటు ఆవశ్యకత ఉంది కాబట్టి బడ్జెట్లో ఆంధ్ర ప్రదేశ్ కు తెలంగాణ కంటే కొంత మేర ఎక్కువ నిధులు కేటాయించామని కానీ ఇందులో తెలంగాణకు అన్యాయం చేయాలని ఉద్దేశం ఎక్కడ లేదన్నారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా కేటాయింపులు జరిగాయని అలా అయితే తమిళనాడు కర్ణాటక బిజెపి పార్టీ అధికారంలో లేదని వారికి సైతం అన్ని రాష్ట్రాలకు మాదిరిగానే కేటాయింపులు చేశామన్నారు. దేశంలో 85% ఉన్న పేదల కోసం మోడీ సర్కార్ పనిచేస్తుందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ కోసం మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కేంద్రం ఎలాంటి గ్యారెంటీ అవసరం లేకుండా గతంలో 10 లక్షలు ఇచ్చే ముద్రా రుణాలను 20 లక్షలకు పెంచిన ఘనత మోడీ ప్రభుత్వం దే అన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఇంటింటికి గ్యాస్, ప్రధాని ఆవాస్ యోజన పథకం ద్వారా ఇప్పటివరకు మూడు కోట్ల ఇల్లు ఇచ్చామన్నారు. ఐదేళ్లు మోడీ సర్కార్ వికసిద్భారత్ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందన్నారు. కేంద్ర బడ్జెట్ సామాజిక ఆర్థిక, వ్యవసాయ, యువత అభివృద్ధికి తోడ్పడే విధంగా బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. ఎన్డీఏ కూటమికి దేశమంతా సమానమే అని ఏ రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్న అందరిని సమానంగా చూస్తామన్నారు. అంబేద్కర్ ఆశయసాధన కోసం తన పార్టీ పనిచేస్తుందన్నారు. రాష్ట్రాల్లో నీటిపారుదల ప్రాజెక్టులకు, జాతీయ రహదారులకు తమ వంతు సహాయ సహకారం నిరంతరం అందిస్తున్నామన్నారు.

అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పై కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిన కొన్ని సీట్లు పెంచుకునే విషయంలో సఫలమైన కూడా ప్రజల ఆదరణ తో మోడీ సర్కార్ మూడో సారి అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ బడ్జెట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో 22 వేల కోట్లు గ్రాండ్స్ కింద వస్తున్నట్లు సాక్షాత్తు డిప్యూటీ సీఎం బడ్జెట్ ప్రసంగంలో తెలిపారనీ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా మూడు కోట్ల ఇండ్లు వస్తాయని అందులో తెలంగాణకు కూడా ఇండ్ల కేటాయింపులు ఉంటాయని వాటిని పేరు మార్చి ఇందిరమ్మ ఇండ్ల కింద లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు ప్రగల్భాలు పలుకుతున్నారు. ముద్ర యోజన పథకాన్ని ఉపయోగించుకొని పెద వారు పారిశ్రామవేత్తలుగా ఎదుగుతున్నారని ఆ పథకం విజయవంతం కావడంతో పేదలు మరింత ఆర్థికంగా ఎదుటడానికి 10 లక్షలు నుంచి 20 లక్షలకు ముద్ర లోన్ పెంచడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో రాజ్యాంగాన్ని మారుస్తామని ఎన్డీఏ వస్తే దళితులకు అన్యాయం జరుగుతుందని దుష్ప్రచారం చేసి కొన్ని సీట్లను పెంచుకున్నప్పటికీ దేశ ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వం మీద నమ్మకం భరోసా ఉంచారే కాబట్టి మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని ఎన్నుకున్నారన్నారు. ఈ దేశంలో 1962 తర్వాత జవహర్లాల్ నెహ్రూ మూడుసార్లు ప్రధానిగా అయిన ఘనత నరేంద్ర మోడీ అన్నారు. మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్లపాటు పాలన సాగించి నాలుగో సారి గెలిచేందుకు మార్గాలు ఎన్నుకుంటుందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో కొడంగల్ తప్ప మిగతా నియోజకవర్గాల పేరు ఎక్కడ కూడా వినిపించలేదు అన్నారు. కొడంగల్ మెడికల్ కాలేజ్ కేటాయించినట్లుగా మెదక్ మెడికల్ కాలేజీకి ఎందుకు నిధులు కేటాయించలేదో చెప్పాలన్నారు దాన్ని ప్రశ్నించేందుకు ఒక ఎమ్మెల్యే కూడా మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బడ్జెట్ అంటే అంకలకా రెడ్డి కాదని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాలకు సమపాళ్లలో కేటాయింపులు చేస్తూ కేంద్ర బడ్జెట్ ఎక్కడ లోతుపాట్లు లేకుండా ఉంటాయన్నారు.

# సీఎంఆర్ పెండింగ్ పెట్టొద్దు

### మిల్లర్లకు అదనపు కలెక్టర్ ఆదేశం



**వికారాబాద్, (ప్రజాస్వరం):**
లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ డెలివరీలో ఆలస్యంపై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లు పట్టిన బియ్యాన్ని (సీఎంఆర్) ఎఫ్‌సీఐ కి నిర్ణీత సమయంలో చేరవేయడంలో అలసత్వం వహించకూడదన్నారు. 202122 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సీఎంఆర్ ను ఆగస్టు 15లోపు అందించాలని సూచించారు. అదేవిధంగా 202223 ఖరీఫ్ సీజన్ కి సంబంధించి సెప్టెంబర్ మొదటి వారంలోగా సీఎంఆర్ ఇచ్చేలా మిల్లర్లు కృషి చేయాలన్నారు. మిల్లర్లు నిర్ణీత సమయానికి సీఎంఆర్ ను ఇవ్వకపోవడం వల్ల సమయాన్ని పెంచుతూ పోవడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. మిల్లర్ల యాజమాన్యాలు, యూనియన్ నాయకులు కలిసి ఒక్క తాటి పైకి వచ్చి సీఎంఆర్ ను నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు. రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులు సమిష్టిగా పని చేస్తూ సీఎంఆర్ లక్ష్యాలను అధిగమించాలని ఆయన సూచించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మిల్లింగ్ అయ్యేలా డిప్యూటీ తహసీల్దార్లు తమ కార్యాచరణను రూపొందించుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు తమ రోజువారీ టూర్ డైరీల్లో ఏయే మిల్లులను సందర్శించారో నమోదు చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయ్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



## నాటు సారా విక్రయిస్తే చర్యలు



**వికారాబాద్, జూలై 27(ప్రజా స్వరం):**
ఎవరైనా నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గిరి హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ ఎస్సై గిరి, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామ శివారులో దాడులు నిర్వహించారు. తట్టేపల్లి గ్రామానికి చెందిన జాదవ్ చందర్ తన పొలంలో రహస్యంగా నాటు సారా తయారు చేస్తున్నాడన్న సమాచారంతో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. రెండు డ్రమ్ముల్లో నిలువ చేసిన 150 లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేశారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వాన్ని పడగొడతామంటే మేం తొడగొడతాం

### బీఆర్ఎస్ నేతలకు పరిగి ఎమ్మెల్యే సవాల్



**వికారాబాద్, జూలై 27 (ప్రజా స్వరం):**
రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు అవాకులు, చవాకులు మానుకోవాలని వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హితవు పలికారు. శనివారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకులు పడగొడతామని పదేపదే చేస్తున్న ప్రచారంపై ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వాన్ని పడగొడతామంటే తాము తొడగొడతామని సవాల్ విసిరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ వారిని విమర్శించిన బీఆర్ఎస్ నేతలు వాస్తవాలు గుర్తించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు పాండవులలాగా కౌరవుల వంటి బీఆర్ఎస్ పార్టీ పై విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతుందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా నెరవేరుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఘనంగా శుభప్రద్ పటేల్ జన్మదిన వేడుకలు




**వికారాబాద్, జూలై 27(ప్రజా స్వరం):**
రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ జన్మదిన వేడుకలు వికారాబాద్ జిల్లా తాండూరులో ఘనంగా నిర్వహించారు. నాయకులు అభిమానులు, ఆత్మీయులు కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుభప్రద్ అభిమానులతో కలిసి రసూల్ పుర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రేశ్వర ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గుడి ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భానుప్రసాద్, విజయ్, నరేశ్, హరీష్, ఆబిద్ చౌష్, శివకుమార్, లక్ష్మణ్ చారీ, అనిల్ గౌడ్, బాలు, ఆనందం, శశాంక్, వినోద్, చందు, శ్రావణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వ్ ఫారెస్ట్ లో అధికారుల తనిఖీలు

**వికారాబాద్, జూలై 27(ప్రజాస్వరం):**
వికారాబాద్ జిల్లాలో 2024 సంవత్సరానికి సంబంధించిన ప్లాంటేషన్లను చార్మినార్ సర్కిల్ అటవీ సంరక్షణాధికారి రాంబాబు శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వికారాబాద్ రేంజ్ పరిధిలోని తిప్పాపూర్ రిజర్వ్ ఫారెస్ట్ లోని 20 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్, పరిగి రేంజ్ పరిధిలోని మిట్టకోడూర్ రిజర్వు ఫారెస్ట్ లోని 10 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్ ,ఫర్ పల్లి లోని అర్బన్ ఫారెస్ట్ పార్కును తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, వికారాబాద్ రేంజ్ అధికారి శ్యాం కుమార్ ,పరిగి రేంజ్ అధికారి ఎండీ అబ్దుల్ హై , సంబంధిత సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యనందించాలి

### జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమా హారతి

**తాండూరు, జూలై 27(ప్రజాస్వరం):**
విద్యా ప్రమాణాలు పెంపొందించేలా ఉపాధ్యాయుల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి పఠనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. శనివారం పాఠశాలల రాష్ట్ర పరిశీలన బృందంతో కలిసి వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం పాత తాండూరులోని ప్రభుత్వ నెంబర్ -2 పాఠశాలను అడిషనల్ కలెక్టర్ ఉమా హారతి సందర్శించారు. ప్రతి విద్యార్థితో ఆమె మాట్లాడి ఉపాధ్యాయులు విద్యను ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల ఉపాధ్యాయులతో కూడా మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాలు, విద్యాబోధన తీరు గురించి ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉద్యమించాలని సూచించారు.






ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం, 27 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

## నీతి ఆయోగ్ సమావేశం నుంచి మమత వాకౌట్



న్యూఢిల్లీ, జూలై 27 (ప్రజాస్వరం): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నిర్వహించిన నీతి ఆయోగ్ సమావేశం నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాకౌట్ చేసింది. సమావేశంలో మాట్లాడనివ్వకుండా తన మైక్ ఆఫ్ చేసారని ఆరోపించింది. నీతి ఆయోగ్ ను రద్దు చేసి ప్లానింగ్ కమిషన్ తిరిగి తేవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు సమావేశంలో 20 నిముషాలు మాట్లాడారు.. ఇతర నేతలు 15 నిముషాలు మాట్లాడారు.. విపక్షాల నుంచి నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైందని నేను ఒక్కరినే.. కనీసం నాకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు.. కేంద్రం వివక్షా పూరితంగా వ్యవహరిస్తుంది.. కేంద్ర బడ్జెట్ రాజకీయంగా ఉంది అని సీఎం మమతా మండిపడింది. నీతి అయోగ్ సమావేశంలో నా మైక్ కట్ చేయడం అంటే.. బెంగాల్ ప్రజలను మాత్రమే కాదు అన్ని ప్రాంతీయ పార్టీలను కూడా అవమానించడమేనిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఇక, బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఏకపక్ష కేటాయింపులు చేసిందంటూ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారు. అలాగే, బీహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా ఈ భేటీకి గైర్హాజరు అయ్యారు. ఈ సమావేశానికి దూరంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సూఖు, కేరళ ముఖ్యమంతిర పినరయి విజయన్ లాంటి వారందరూ ఈ నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారు.



## ఆధారాలుటే చూపాలి..

### హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో దశ, దిశ లేని పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శాసనసభలో బడ్జెట్ పద్దుపై అసెంబ్లీలో జరుగుతున్న చర్చలో ఆయన శనివారం మాట్లాడారు. బడ్జెట్ ప్రసంగం ఒక రాజకీయ ప్రసంగంలా ఉందన్నారు. రూ.4.5లక్షలు లేని జీఎస్‌డీపీని రూ.14లక్షలకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన బాగాలేదని మాటలు చెబితే సరిపోతుందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ టార్గెట్ గానే బడ్జెట్ ప్రసంగం ఉందన్నారు. ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెబుతోందని తెలిపారు. బడ్జెట్‌లో వాస్తవాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన బాగాలేదని అంటున్నారని ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ.200 పింఛన్‌ను రూ. 2వేలకు పెంచామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ రూ.4వేల పింఛన్ నాలుక మీదనే ఉందన్నారు. పదేళ్ల పాలనలో ఉన్న సమాచారాన్ని తొలగించారని ఫైర్ అయ్యారు. 8 నెలల్లో ప్రభుత్వం ఏం సాధించిందో చెప్పాలని కోరారు. కరెంట్ ఎలా ఉందో ప్రజలను అడుగుదామని హరీష్ రావు అన్నారు. ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువ వస్తుందని బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు.విధానాల రూపకల్పన కంటే మమ్మల్ని తిట్టడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ పరిస్థితి గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని.. కేశవరావు ఇంటికి సీఎం పోతే కరెంట్ పోయిందని గుర్తు చేశారు.

**అప్పుడు విమర్శించి.. ఇప్పుడు భూములు అమ్ముతారా..**

శాసనసభలో 2024–25 వార్షిక బడ్జెట్ పద్దుపై చర్చ వాడీవేడిగా కొనసాగుతోంది. మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. నాన్ ట్యాక్స్ రెవెన్యూలో రూ.35వేల కోట్లు వస్తుందని బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు. గతంలో రుణమాఫీ కోసం భూములు అమ్మితే భట్టి, శ్రీధర్ బాబు విమర్శించారని.. ఇప్పుడు రూ.10 వేల కోట్ల భూములు అమ్మి నిధులు సమీకరిస్తామని చెప్పారని తెలిపారు. రూ.24వేల కోట్లు అదనంగా ఎలా తీసుకువస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీ మాటపై గౌరవం ఉంటే భూములు అమ్ముకునే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్నారు. సాధ్యం కానీ తరహాలో ఆదాయం ఎక్కువ చూపారన్నారు. తప్పనిసరి ఖర్చులను తక్కువ చేసి చూపారని ఆక్షేపించారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారని.. కానీ బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు మాత్రమే వస్తోందన్నారు. రుణమాఫీ ఇవ్వడం ఆలస్యం అయిందని రైతుల నుంచి బ్యాంకర్లు వడ్డీ వసూలు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం రుణమాఫీ ఆలస్యం చేసి రైతులపై భారాన్ని మోపుతుందని సీరియస్ అయ్యారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తాము కొనసాగించామని గుర్తు చేశారు. కేసీఆర్ కిట్‌లాంటి పథకాల పేర్లు మార్చి పంపిణీ చేసినా మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

**మైనార్టీల విషయంలో బడే భాయ్ తరహాలోనే...**

తెలంగాణ శాసనసభలో 2024–25 బడ్జెట్ పద్దుపై శనివారం వాడీ వేడి చర్చ కొనసాగుతోంది. అయితే మైనార్టీల విషయంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సెటైర్లు వేశారు. మైనార్టీల విషయంలో బడే భాయ్ తరహాలోనే చోటా భాయ్ కూడా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మైనార్టీలకు ఒక్క మంత్రి పదవి, ఎమ్మెల్సీ ఇవ్వలేదన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ అని చెప్పారని.. బేషజాలకు పోకుండా హామీలు అమలు చేయాలన్నారు.

# విచారణకు సిద్ధమా..



## గొర్రెల పథకంలో రూ.700 కోట్లను స్వాహా

### లక్షల కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను రూ.7కోట్లకు అమ్మారు

### బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లలో అవకతవకలు

### బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం) : తెలంగాణ అసెంబ్లీలో 2024–25 వార్షిక బడ్జెట్ పద్దుపై చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సంచలన సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, గొర్రెల స్కీమ్‌లో జరిగిన అవకతవకలపై బీఆర్ఎస్ నాయకులు విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొర్రెల పథకంలో రూ.700 కోట్లను స్వాహా చేశారన్నారు. బతుకమ్మ చీరల విషయంలో దోపిడీ జరిగిందన్నారు. కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందన్నారు. గతంలో వేల కోట్ల రూపాయల భూములు అమ్మేశారన్నారు. అప్పుల లెక్కలు చెప్పిన హరీష్ రావు అమ్మకాల లెక్కలు చెప్పలేదన్నారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పదేళ్లలో పూర్తి చేయలేదన్నారు. లక్షల కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను రూ.7కోట్లకు అమ్మారని గులాబీ పార్టీపై మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రంగారెడ్డి జిల్లాలో భూములు అమ్ముకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ఆలోచన మారలేదు.. విధానం మారలేదన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు తీరువల్లే కేంద్ర బడ్జెట్‌లో ఒక్క పైసా రాలేదని ఆరోపించారు.

**కాళ్లు, చేతులు విరిచినా బుద్ధిమారదా?**

బడ్జెట్‌లో అప్పుల లెక్కలు చెబుతున్న హరీశ్‌రావు.. వారి హయాంలో అమ్ముకున్న లెక్కలు చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కాళ్లు, చేతులు విరిచేసినా.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఉరితీసినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'సూరత్' చీరలతో మభ్యపెట్టారు**

సెంటిమెంట్‌తో కూడుకున్న బతుకమ్మ చీరల విషయంలో అవినీతికి పాల్పడ్డారని, చేనేతకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పి సూరత్ వెళ్లి కిలోల లెక్కన చీరలు తీసుకువచ్చి ఆడబిడ్డలను మభ్యపెట్టారని గత బీఆర్ఎస్ సర్కార్‌పై ముఖ్యమంత్రి మండిపడ్డారు.

**రింగురోడ్డును పల్లీబఠాణిలా అమ్మారు..**

లక్షల కోట్ల విలువైన అద్భుతమైన ఔటర్ రింగ్ రోడ్డును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తే దానిని పల్లీబఠాణి మాదిరిగా రూ.7 వేల కోట్లకు తెగనమ్మారని ఆరోపించారు. గొర్రెల పథకంలో భారీ స్కామ్ చేశారు.. ఈ స్కీమ్‌పై ఏసీబీ చేసిన దర్యాప్తులోనే రూ.700 కోట్లు స్వాహా చేసినట్లు రిపోర్టులు వచ్చాయి.. అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పెట్టిందే రూ.80 వేల కోట్లు అయితే రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని నిన్నా మొన్నటి వరకు సవాల్ చేశారని, ఇప్పుడేమో రూ. 94 వేల కోట్లే ఖర్చు చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

**ఇంకా ఉందా అని చూసేందుకే మేడిగడ్డకు బీఆర్ఎస్...**

మేడిగడ్డ ఎలా కూలింది? ఇంకేమైనా మిగిలిందా? అని చూసేందుకు బీఆర్ఎస్ నేతలు నిన్న మేడిగడ్డకు వెళ్లారని సీఎం సెటైర్ వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరుకు గడిచిన పదేళ్లలో ఎక్కువ అన్యాయం జరిగిందని, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు రంగారెడ్డి, సంగంబండ, రాజోలి బండ, జూరాల ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి బీఆర్ఎస్ నేతల దుర్మార్గం కాదా..? అని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలో వేలకోట్ల రూపాయల భూములు అమ్మేశారని, ఆ జిల్లాకు కనీసం మౌలిక వసతులు కల్పించలేకపోయారని మండిపడ్డారు.

**హరీశ్.. ఇదిగో సాక్ష్యం**

హరీశ్‌రావు అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. విద్యుత్ మీటర్ల విషయంలో తాము కేంద్రంతో పోరాటం చేశామని, రూ.30 వేల కోట్ల రుణాలు తీసుకునే అవకాశం ఉన్నా తాము తిరస్కరించామని హరీశ్‌రావు చెప్పిన మాటలన్నీ అబద్ధాలేనని తిప్పికొట్టారు. 4 జనవరి 2017 ఆనాటి సీఎం కేసీఆర్ మీటర్లు బిగిస్తామని మోడీతో ఒప్పందం చేసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బయట మాట్లాడినట్టే సభలో కూడా అబద్ధాలతో బుకాయించాలనే చూడటం సబబు కాదన్నారు.

## ఆగస్టు 2 వస్తుంది పోతుంది..

### కేటీఆర్ కు పొన్నం కౌంటర్..

హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం) : ఆగస్టు 2 కూడా వస్తుంది పోతుందని కేటీఆర్ కు రవాణా, బీసీ సంక్షేమం శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ఇంకా యువరాజు అనుకుంటున్నారని వ్యంగాస్త్రం వేశారు. ప్రభుత్వానికి ఆయన అల్టిమేటం ఇచ్చేది ఏం లేదన్నారు. ఆగస్టు 2 కూడా వస్తుంది..పోతుందన్నారు. కాళేశ్వరం లో ఏం జరిగింది అనేది అందరికీ తెలుసన్నారు. కేంద్రం నుండి నిధులు తెప్పించు కిషన్ రెడ్డి అని ప్రశ్నించారు. హైదరాబాద్ కి ఒక్క పైసా ఇప్పించలేదు మీరు అని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం 10 వేల కోట్లు పెట్టిందన్నారు. పైసా ఇవ్వకుండా తిరిగి ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేయడం మూర్ఖత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ మోడీకి అన్ని బిల్లులకు సపోర్ట్ చేసి నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లలేదన్నారు. మేము కేంద్ర బడ్జెట్ పై తెలంగాణకు జరిగిన అన్యాయంపై నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లకుండా నిరసన తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తి అయిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టకపోవడం వలన మనకు నష్టం జరిగిందని తెలిపారు. విహార యాత్రలకు వెళ్లినట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు బీఆర్ఎస్ నేతలు వెళ్లారని మండిపడ్డారు. రైతాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. హుకుం జారీ చేయడానికి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లేదని గుర్తు చేశారు.



# వరద గోదారి..

### భద్రాచలం వద్ద ఉధృతంగా గోదావరి.. పెరుగుతున్న నీటి మట్టం

హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం) : ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వానలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నది. ఎగువ రాష్ట్రాల నుంచి భారీగా వరద వస్తుండటంతో ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. ఎడతెరిపి లేకుండా పడుతున్న వానలకు, ఎగువ నుంచి వస్తున్న వరదలకు భద్రాచలం వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నది. శుక్రవారం రాత్రి 9 గంటలకు 48 అడుగులు ఉన్న నీటి మట్టం ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు 52. 1 అడుగులకు చేరింది. గోదావరి వద్ద రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. 53 అడుగులకు చేరుకుంటే మూడో ప్రమాద హెచ్చరిక అమలు చేస్తారు. వరదలతో చాలా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు క్రమంగా వరద పెరుగుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,091 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 1073.60 అడుగులకు చేరుకున్నది. నిర్మల్ జిల్లా స్వర్ణ ప్రాజెక్టుకు 2,700 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. సంగారెడ్డిలోని సింగూరు ప్రాజెక్టు కు భారీగా వరద నీరు చేరుతున్నది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2991 అడుగులు కాగా... ప్రస్తుతం 14.06 టీఎంసీలుగా ఉన్నది. పెద్దపల్లి జిల్లా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుక నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 16.91 టీఎంసీలు ఉన్నది.

# కృష్ణమ్మ పరవళ్లు..

### శ్రీశైలం డ్యామ్‌కు పోటెత్తిన వరద

హైదరాబాద్, జూలై 27 (ప్రజాస్వరం) : శ్రీశైలం డ్యామ్ క్రమంగా వరద పోటెత్తుతోంది.. ఓవైపు కృష్ణా రివర్.. మరోవైపు తుంగభద్ర నది నుంచి భారీ ఎత్తున వరద వచ్చి శ్రీశైలం జలాశయంలో చేరుతోంది.. దీంతో.. శ్రీశైలం ప్రాజెక్టులో గంటకు ఒక టీఎంసీ చొప్పున నీటిమట్టం పెరుగుతోంది.. తుంగభద్ర జలాశయంలో 28 గేట్ల ద్వారా లక్ష 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు అధికారులు.. ఇక, సుంకేసుల జలాశయం నుంచి 20 గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.. ఇక, తుంగభద్ర నుంచి నీటి విడుదల లక్షా 50 వేలకు పెంచే అవకాశం కూడా ఉంది.. జూరాల నుంచి ఇప్పటికే 2 లక్షల 51 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది.. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి శ్రీశైలం డ్యామ్‌కు 3 లక్షల 40 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.. రోజుకు 25 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయంలో చేరుతుందని నీటిపారుదల శాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు.. రాబోయే 15 రోజుల్లో కృష్ణ బేసిన్ లోని అన్ని ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టాలకు చేరుతాయని అంచనా వేస్తున్నారు.. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 864.4 అడుగులకు చేరుకుంది.. నీటినిలువ సామర్థ్యం 215 టీఎంసీలు అయితే.. ప్రస్తుతం 118.5 టీఎంసీలుగా ఉంది.. ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోన్న నేపథ్యంలో.. సోమ లేదా మంగళవారాల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉందంటున్నారు.. కాగా, శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తే సమయంలో పెద్ద సంఖ్యలో పర్యాటకులు, భక్తులు తరలివస్తుంటారు.

